సాక్షి నిజామాబాద్

సోమవారం । 5 । ఆగస్టు । 2024



సంపద వనాలపై పట్టింపేదీ?

గ్రామ పంచాయతీలు సంపద సృష్టిం చుకోవడం కోసం ఏర్పాటు చేసిన వనాలను పట్టించుకునేవారు కరువయ్యారు.

- 8లో ▸



రెచ్చిపోతున్న కేటుగాళ్లు

సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారు. పోలీసుల పేరుతో ఫోన్ చేసి డబ్బులు అడుగుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.1 /24.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ముగిసిన టీసీసీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్ : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్(టీసీసీ) పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. నగరంలో శ్రీ నూతన వైశ్య ఉన్నత పాఠశాల, ఆదర్శ హిందీ విద్యాలయంలో పరీక్షలు జరిగాయి. ఆయా పరీక్షలకు 435మందికి 433మంది హాజరయ్యారు.

పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలి



నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 5,571 పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యానంద్, రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జీవో 11, 12లను సవరించి డిగ్రీ, బీఈడీ అర్హతతో నియామకం అయిన ఎస్జీటీలకు కూడా హెచ్ఎంగా పదోన్నతి కల్పించాలన్నారు. బదిలీ అయిన అందరు ఎస్జీటీలను రిలీవ్ చేయాలని కోరారు. పదోన్నతి, బదిలీలతో ఏర్పడిన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్జీటీలకు కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలన్నారు. నాయకులు సిరాజుద్దీన్, మల్లేశ్, గంగాధర్, జనార్దన్, రాజారాం, ఆనందం, బాబు, శంకర్, లక్ష్మణ్, రాజేశ్వర్, రవీందర్, భాజన్న, భూమేశ్వర్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టకపోతే ఏజెన్సీ రద్దు



వర్ని : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పెట్టకపోతే మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేస్తామని డీఈవో దుర్గాప్రసాద్ హెచ్చరించారు. కోటగిరి మండలం కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు కూరలు రుచిగా చేయకుండా కారంతో కూడిన భోజనం పెడుతున్నారని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో డీఈవో ఆదివారం పాఠశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు భోజనాన్ని పరిశీలించాలని సూచించారు. కోటగిరి ఎంఈవో నాగనాథ్, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఉన్నారు.

బకాయిలు విడుదల చేస్తాం

వర్ని : మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు బకాయిలను వెంటనే విడుదల చేస్తామని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రూ.18 కోట్లు విడుదల చేస్తారని పేర్కొన్నారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు చెల్లించాల్సిన వంట ఖర్చులు, కార్మికుల వేతనం జూన్ నెల వరకు చెల్లిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్



నిజామాబాద్ అర్బన్ : దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతిలోనే ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని బస్వా గార్డెన్‌లో ఆదివారం తపస్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టీచర్లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గురువు లేకుంటే పిల్లల భవిష్యత్‌కు దిక్సూచి లేదన్నారు. అనంతరం డీఈవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రోత్సాహం అందించేలా ఇలాంటి సన్మాన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులకు సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. తపస్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, రాష్ట్ర ప్రధాన కార్యర్శి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రినాథ్ పాల్గొన్నారు.

డెంగీతో చిన్నారి మృతి

బాన్సువాడ/బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండలం చించోలి గ్రామానికి చెందిన ధనుశ్రీ అనే ఏడేళ్ల చిన్నారి డెంగీతో మరణించింది. వివరాలిలా ఉన్నాయి. ధనుశ్రీ బాన్సువాడలోని ప్రైవేట్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతోంది. ఆమె ఐదు రోజుల క్రితం డెంగీ బారిన పడింది. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించింది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

నీటి విడుదల ఖరారు

ప్రస్తుతం నీరందించే ఆయకట్టు (ఎకరాల్లో..)

4.60 లక్షలు	25,000	35,000	57,793	38,967	11,600
కాకతీయ కాలువ ఎల్ఎండీ వరకు	లక్ష్మి కాలువ	సరస్వతి	అలీసాగర్ ఎత్తిపోతలు	గుత్ప ఎత్తిపోతలు	చౌటుపల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతలు
నిజామాబాద్ జిల్లాలో 14 ఎత్తిపోతల ద్వారా		34,948	ఆదిలాబాద్ జిల్లాలో 9 ఎత్తిపోతల ద్వారా		30,417

- ఈ నెల 7 నుంచి కాలువల ద్వారా విడుదలకు నిర్ణయం
- కాకతీయ కాలువ ద్వారా ఎల్ఎండీ వరకు 4.60 లక్షల ఎకరాలకు..
- లక్ష్మి, సరస్వతి కాలువల పూర్తి ఆయకట్టుకు సాగునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వానాకాలం సీజన్‌కు నీటి విడుదల షెడ్యూల్ ఖరారైంది. ఆయకట్టుకు నీటి విడుదలపై శనివారం సీవం (స్టేట్ లెవల్ కమిటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ వాటర్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్) కమిటీలో నిర్ణయించారు. ఈ నెల 7 నుంచి ప్రాజెక్ట్ అన్ని కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టనున్నారు. కాకతీయ కాలువ ద్వారా వారబందీ ప్రకారం నీటిని వదలనున్నారు. ఏడు రోజులు మూడు వేల క్యూసెక్కుల చొప్పున, ఎనిమిది రోజులు ఐదు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. అన్ని కాలువల ద్వారా నీటి విడుదలకు షెడ్యూల్ నిర్ణయించడంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 45 టీఎంసీల నీరు ఉంది. ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం ఆశాజనకంగా ఉంది. కాకతీయ కాలువ ద్వారా ఎల్ఎండీ ఎగువ వరకు 4.60 లక్షల ఎకరాలకు, లక్ష్మి కాలువ ద్వారా 25 వేలు, సరస్వతి కాలువ ద్వారా 35 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలని నిర్ణయించారు.

ఖరీఫ్‌కు భరోసా

ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో ఉన్న నీరు, మరో 3 నెలలు పాటు ఎగువ నుంచి వరదలు వచ్చే అవకాశం ఉండటంతో ప్రాజెక్ట్ అధికారులు నీటి లభ్యతను అంచనా వేసి ఖరీఫ్ పంటలకు నీటి విడుదల షెడ్యూల్ చేశారు. ఆయకట్టుకు ఒక పంటకు నీరు అందించాలన్న ప్రాజెక్ట్‌లో కనీసం 56 టీఎంసీల నీరు వచ్చి చేరాలి. ప్రస్తుతం అంతకంటే తక్కువగా ఉన్నా.. నీటి విడుదల షెడ్యూల్ ఖరారు చేశారు. ఎగువ నుంచి వరద నీరు వచ్చే అవకాశం ఉండటంతో నీటి విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్థానిక ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 22 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 492 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1079.8 (45టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిని ఈ నెల 7 నుంచి కాలువల ద్వారా విడుదల చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆయకట్టు రైతులు ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలి. ప్రాజెక్ట్ అధికారులతో సహకరించాలి.

– చక్రపాణి, ప్రాజెక్ట్ ఈఈ, ఎస్సారెస్పీ

విద్యుదుత్పత్తికి సిద్ధం!

ఎస్సారెస్పీ నుంచి కాలువల ద్వారా నీటి విడుదలకు షెడ్యూల్ ఖరారు కావడంతో జల విద్యుత్ కేంద్రంలో కరెంట్ ఉత్పత్తికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా వెయ్యి క్యూసెక్కులపై నీటిని వదిలితే విద్యుత్ ఉత్పత్తి చేపట్టవచ్చు. నాలుగు టర్బయిన్ల ద్వారా 36 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉంది. హెడ్ లెవల్ ఎక్కువగా ఉంటే అంతకుమించి కూడా విద్యుత్‌ను ఉత్పత్తి చేపట్టవచ్చు. ఒక్క టర్బయిన్‌కు 2200 క్యూసెక్కుల నీరు అవసరం ఉంటుంది. కాకతీయ కాలువ నీటి సామర్థ్యం 9 వేల క్యూసెక్కులు. జలాశయంలోకి ఏటేటా వరదలు తగ్గుముఖం పడుతుండటంతో నీటి విడుదల సకాలంలో చేపట్టడం లేదు. ఫలితంగా విద్యుత్ ఉత్పత్తి సకాలంలో చేపట్టడం లేదు. దీంతో ఉత్పత్తి లక్ష్యాన్ని కూడా క్రమంగా తగ్గించారు. గతేడాది 75 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని విధించగా అంతకు మించి కరెంట్ ఉత్పత్తి చేశారు. జలవిద్యుత్ కేంద్రంలో తయారైన కరెంట్‌ను బుస్సాపూర్ శివారులోని సబ్ స్టేషన్‌కు సరఫరా చేసి అక్కడి నుంచి గ్రామాలకు సరఫరా చేస్తారు.



జల విద్యుత్ కేంద్రంలో టర్బయిన్లు

ఎలాంటి సమస్య లేదు

కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టగానే జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం. నాలుగు టర్బయిన్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్రంలో ఎలాంటి సమస్య లేదు.

– శ్రీనివాస్, జెన్‌కో డీఈఈ, ఎస్సారెస్పీ

నేడు డీసీఎంఎస్ చైర్మన్ ఎన్నిక

- పదవి కోసం తీవ్ర పోటీ
- కామారెడ్డి జిల్లాకు దక్కే అవకాశం
- ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతున్న ఇంద్రసేనారెడ్డి



ఇంద్రసేనారెడ్డి



తారాచంద్

సుభాష్‌నగర్ : ఇందూరు ఉమ్మడి జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఐడీసీఎంఎస్) చైర్మన్ పదవి కామారెడ్డి జిల్లాకే దక్కే అవకాశాలు ఉన్నాయి. ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతున్న ఇంద్రసేనారెడ్డి (బీబీపేట్ సొసైటీ చైర్మన్)తోపాటు రాంపూర్ సొసైటీ చైర్మన్ తారాచంద్ మధ్య చైర్మన్ పదవి కోసం తీవ్రస్థాయిలో పోటీ నెలకొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చైర్మన్‌గా ఉన్న సాంబారు మోహన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఇన్‌చార్జి చైర్మన్‌గా ఇంద్రసేనారెడ్డి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం పూర్తిస్థాయి చైర్మన్ పదవి కోసం ఎన్నికలు నిర్వహిస్తున్నారు. డీసీఎంఎస్ పాలకవర్గం 2020 ఫిబ్రవరిలో ఎన్నికైంది. ఇందులో మొత్తం 10 మంది డైరెక్టర్లు (ఆరుగురు సొసైటీ చైర్మన్లు, నలుగురు బీ కేటగిరీలో) ఉంటారు. సాంబారు మోహన్ నల్లవెల్లి చైర్మన్ పదవికి రాజీమానా చేయడంతో ఆయన డీసీఎంఎస్ డైరెక్టర్‌గా అనర్హులయ్యాడు. ఐదుగురు సొసైటీ చైర్మన్లు ఉండగా, బీ కేటగిరీ నలుగురిలో ఇద్దరు అనర్హులు. ఏడుగురిలో ఆరుగురు కాంగ్రెస్‌కు చెందిన వారు, తాడ్వాయి సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ డైరెక్టర్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి ఒక్కరే బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆరుగురు డైరెక్టర్లు కాంగ్రెస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ నేతృత్వంలో క్యాంపులో కొనసాగుతున్నారని తెలిసింది. కాగా అదే జిల్లా నుంచి సామాజిక వర్గాలను పరిగణనలోకి తీసుకుంటే గాంధారి సొసైటీ చైర్మన్ సాయికుమార్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. కాగా ఈ పాలకవర్గం గడువు మరో ఆరు నెలలు మాత్రమే ఉంది.

ఆనవాయితీ ప్రకారం..

డీసీసీబీ, డీసీఎంఎస్ పదవులు ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్నాయి. డీసీసీబీ ఒక జిల్లాకు, డీసీఎంఎస్ మరో జిల్లాకు కేటాయించడం పదేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్‌గా నిజామాబాద్ జిల్లాకు చెందిన కుంట రమేశ్‌రెడ్డి కొనసాగుతున్నారు. డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ఇంద్రసేనారెడ్డి ఏప్రిల్ 19న బాధ్యతలు స్వీకరించారు. డీసీఎంఎస్ కామారెడ్డి జిల్లాకు కేటాయించాలని ఆ జిల్లా నుంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం ఆ జిల్లాకు చెందిన నేతకే చైర్మన్ పదవి ఇచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇందు కోసం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ పట్టుబడుతున్నారు. నిజామాబాద్ నుంచి అమ్రాద్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, రాంపూర్ సొసైటీ చైర్మన్ తారాచంద్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి.

ఎన్నికల అధికారిగా రామ్మోహన్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో ఉదయం 9 గంటల తర్వాత చైర్మన్ ఎన్నిక ప్రక్రియ మొదలు కానుంది. ఎన్నికల అధికారిగా కామారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ రామ్మోహన్ వ్యవహరిస్తారు. సింగిల్ సెట్ నామినేషన్ పత్రాలు సమర్పిస్తే నిబంధనల ప్రకారం ఎన్నికల అధికారి చైర్మన్ పేరు అధికారికంగా ప్రకటిస్తారు. ఒకవేళ రెండు నామినేషన్లు దాఖలైతే చేతులెత్తే విధానంలో ఎన్నిక నిర్వహిస్తారు.



డీసీఎంఎస్ కార్యాలయం

'మహాలక్ష్మి' సాయం అందేనా!

- మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ప్రకటించిన ప్రభుత్వం
- బడ్జెట్‌లో నిధులు కేటాయించని వైనం



మోర్తాడ్ : అర్హులైన మహిళలకు ఆర్థిక చేయూత అందించడానికి మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెలా రూ.2,500 సాయం అందిస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం అందుకోసం బడ్జెట్‌లో నిధులను కేటాయించలేదు. ఆసరా, ఇతర పథకాల ద్వారా లబ్ధి పొందని మహిళలకు ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొంది. కర్ణాటకలో ఈ పథకం అమలు చేస్తుండగా అదే తరహాలో తెలంగాణలో అమలులోకి తీసుకు వస్తామని కాంగ్రెస్ పెద్దలు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో మహాలక్ష్మి సాయం కోసం 3,55,347 మంది దరఖాస్తులను అందించారు. గత నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహాలక్ష్మి పథకానికి కేటాయింపులు జరపకపోవడంతో పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి ఇతర సంక్షేమ పథకాలకు నిధులను ప్రభుత్వం కేటాయించింది. ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మహిళలకు ఆర్థిక సాయం కోసం కేటాయింపులు ఏమి లేకపోవడం అనేక సందేహాలకు తావిస్తుంది. గతంలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయింపులు జరిపారు. మహాలక్ష్మి పథకం లబ్ధిదారుల గుర్తింపు కూడా క్షేత్రస్థాయిలో పూర్తి చేశామని ప్రభుత్వ పెద్దలు గతంలో చెప్పారు. ఆసరా పథకం కింద లబ్ధి పొందని ఎంతో మంది మహిళలు మహాలక్ష్మి సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

నిజామాబాద్ నాగారం : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజాగౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తానన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సమావేశంలో పట్టణ ట్రస్మా అధ్యక్షుడు ధర్మరాజు, కార్యదర్శి శ్రీనివాస్ జిల్లా ముఖ్య సలహాదారు మామిడాల మోహన్, టీబీసీ పాఠశాల నిర్వాహకుడు ప్రవీణ్ పాల్గొన్నారు.



జిల్లా ఓవరాల్ చాంపియనిషిప్ గెలుచుకున్న రాంపూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి



మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఖలీల్‌వాడి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య వైద్యం ఉచితంగా అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా ల రాజకీయ శిక్షణ తరగతులు, ఏఐటీయూసీ అభినందన సభ కార్యక్రమానికి ఆదివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నగరంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లతో పేదలకు పూర్తిగా లబ్ధి చేకూరడం లేదన్నారు. పేదలకు నేరుగా లబ్ధి జరిగేలా పథకాలు ప్రవేశ పెట్టాలన్నారు. మోదీ ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు రూ.లక్షల కోట్ల బకాయిలు మాఫీ చేసిందని ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీ పసుపు బోర్డు ఎక్కడ పెట్టారో చూపించాలని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీలో బూతులు తిట్టుకుంటూ, సహనం కోల్పోయి ఒకరినొకరు నిందించుకోవడం ఎక్కువైందన్నారు. ఇలా చేస్తున్న ఎమ్మెల్యేలపై వేటు వేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా పేదల సమస్యలు అలాగే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు వివిధ సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రాలు అంజదేశారు.

అంతకుముందు జిల్లా నాయకులు కూనంనేని సాంబశివరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ, జిల్లా కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య, నాయకులు సాయిలు, విఠల్‌గౌడ్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాపై స్పష్టత కరువు

- మార్గదర్శకాలు విడుదల చేయని ప్రభుత్వం
- అయోమయంలో అన్నదాతలు



తల్వేద గ్రామ శివారులో సాగవుతున్న వరి

నందిపేట్ : ప్రతికూల పరిస్థితుల్లో పంటలు దెబ్బతింటే అన్నదాతలకు అండగా ఉండేందుకు ఫసల్ బీమా యోజన అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కానీ నేటికి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. దీంతో ఈ సీజన్‌లో బీమా ఉంటుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం వంద శాతం ప్రీమియం చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. కానీ ఇప్పటికే జిల్లాలో మొక్కజొన్న, సోయా, పసుపు పంటల సాగు పూర్తయింది. వరి నాట్లు కూడా చాలా వరకు వేశారు. అయిదేళ్లుగా రాష్ట్రంలో ఫసల్ బీమా అమలుకు నోచుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వడగళ్ల వర్షాలు, వరదలు, ఈదురు గాలులకు పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందలేదు. గతంలో కేంద్రం 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, రైతులు 20 శాతం ప్రీమియం చెల్లించేవారు. తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకంలో నుంచి బయటకు వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీమా అవశ్యకతను గుర్తించి పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. కానీ మార్గదర్శకాలు విడుదల చేయలేదు. దీంతో అన్ని పంటలకు వర్తిస్తుందా, పంటల వివరాల నమోదు ఆధారంగా వర్తింపజేస్తారా అనే సంశయం రైతుల్లో నెలకొంది.

భరోసా కల్పించాలి



రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా అమలు చేస్తామని చెప్పడం హర్షణీయం. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి. ఈ పథకం మార్గదర్శకాలు విడుదల చేసి ఈ సీజన్ నుంచే అమలు చేయాలి.

– పిప్పెర సాయారెడ్డి, రైతు, తల్వేద

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

ఇటీవల నిర్వహించిన సమావేశాల్లో పంటల బీమా అంశం ప్రస్తావనకు వచ్చింది. ఇప్పటి వరకు ఫసల్ బీమా మార్గదర్శకాలు విడుదల కాలేవు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడుతాం.

– వాజిద్ హుస్సేన్, డీఏవో, నిజామాబాద్

క్లుప్తంగా

హాకీ సౌత్‌జోన్ కోచింగ్ క్యాంపునకు ఎంపిక


మనోజ్ ,అక్షయ

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు బెంగళూరులో నిర్వహించే సౌత్ జోన్ కోచింగ్ క్యాంప్‌నకు ఎంపికయ్యారు. గత నెల 10 నుంచి 17వ తేదీ వరకు కడపలో నిర్వహించిన సౌత్ జోన్ మెన్ అండ్ వుమెన్ హాకీ పోటీల్లో ఏడు రాష్ట్రాలు పాల్గొన్నాయి. అందులో తెలంగాణ నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు హగ్గు మనోజ్, కంచర్ల అక్షయను ఈనెల 13 నుంచి 24వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించే సౌత్ జోన్ మెన్ అండ్ వుమెన్ హాకీ కోచింగ్ క్యాంపునకు ఎంపికయ్యారు. వీరి ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, జిల్లా అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కవి కాసర్ల నరేష్‌రావుకు సినారె పురస్కారం


డాక్టర్ కాసర్ల నరేష్‌రావు

మోపాల్: జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ కాసర్ల నరేశ్ రావు రాష్ట్రస్థాయిలో అందించే సినారె పురస్కారం -2024కు ఎంపికై నట్లు సంస్థ నిర్వాహకులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌లోని మహాకవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది రాష్ట్రస్థాయిలో సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్న వారిని ఎంపిక చేసి ఈ పురస్కారాన్ని అందిస్తారు. ఈ ఏడాది కాసర్ల నరేష్‌రావుకు ఈ పురస్కారం దక్కింది. మూడు దశాబ్దాలుగా ఇందూరు జిల్లా సాహిత్యక్షేత్రంలో కాసర్ల సేవలు అందిస్తున్నారు. కవిగా పది పుస్తకాలను రచించారు. రచయితగా కథలు, వ్యాసాలు అందించారు. పరిశోధకులుగా, సాహిత్య గృహ గ్రంథాలయ నిర్వాహకులుగా, తెలుగు పాఠ్యపుస్తక రచయితగా ఉన్నారు. ఇందూరు జిల్లా బాలసాహిత్య వేదిక అధ్యక్షుడిగా బాలసాహిత్య వికాసానికి కృషి చేస్తున్నారు. సిరికొండ మండలం గడ్కోల్ స్వస్థలంగా ఉన్న డాక్టర్ కాసర్ల.. నగరంలోని సీతారాంనగర్ కాలనీలో నివాసముంటున్నారు. వృత్తిరీత్యా తెలుగు ఉపాధ్యాయులైన కాసర్ల ప్రస్తుతం మోపాల్ మండలంలోని సిర్పూర్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నారు. ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే సినారే కళాపీఠం వారి కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు. తెలుగు సాహిత్య రంగంలో ప్రతిష్టాత్మకంగా భావించే, రాష్ట్రస్థాయి 'సినారె పురస్కారం' కు కాసర్ల ఎంపిక కావడంపై ఇందూరు కవులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాక్టరెక్కిన శునకం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భైరవ అనే పేరుతో, గ్రామ సింహం అనే మరో పేరు కలిగిన కుక్కలు విశ్వాసంగా కాపలా ఉంటాయి. ఇందల్వాయి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ఒంటరి సంతోష్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో తాను పెంచుకునే కుక్క ట్రాక్టర్ మీద రాయల్‌గా కూర్చున్న, నిద్రించిన చిత్రాలను 'సాక్షి' క్లిక్ మనిపించింది.

శ్రావణం.. శుభకరం

- పండుగలకు నెలవైన మాసం
- నేటి నుంచి శ్రావణమాసం


నీలకంఠేశ్వరాలయంలో శివుడి ప్రతిమ


శంభులింగేశ్వరాలయం

నిజామాబాద్ అర్బన్: పండుగలు, పర్వదినాలు, నోములు, వ్రతాలకు అనువైన మాసం శ్రావణ మాసం. సిరిసంపదలు ప్రసాదించమంటూ మహాలక్ష్మిని కొలిచే పవిత్ర శ్రావణంలోనే శివశక్తిని సైతం పూజిస్తాం. శుభాల మాసంగానూ పిలిచే ఈ నెలలో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతాయి. శ్రావణం.. వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రావణ నక్షత్రం నుంచే ఈ మాసానికి ఆ పేరు వచ్చిందని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ శ్రావణం మహావిష్ణువుకి, ముక్కంటికీ ఎంతో ప్రీతికరం.

శివ-శక్తి ఆరాధన ఎందుకంటే..

పరమేశ్వరుడు పాల సముద్ర మథనం నుంచి ఉద్భవించిన హాలాహలాన్ని ఈ శ్రావణంలోనే స్వీకరించి నీలకంఠుడిగా మారాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ మాసంలో వచ్చే సోమవారాలలో పరమేశ్వరుడిని పూజించి, అభిషేకిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయనేది భక్తుల నమ్మకం. ఈ నెలలో వచ్చే మంగళవారాల్లో మంగళగౌరిగా పిలిచే పార్వతీదేవిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయి. చాలా ప్రాంతాల్లో కొత్తగా పెళ్లయిన మహిళలు.. శ్రావణ మంగళవారాల్లో మంగళగౌరి వ్రతాన్ని తమ కుటుంబ ఆచారాలకు తగినట్లుగా నిర్వహిస్తుంటారు. అదేవిధంగా కొన్ని ప్రాంతాల్లో అవివాహితులు కూడా మంచి భాగస్వామిని పొందేందుకు మంగళగౌరిని పూజించే సంప్రదాయం ఉంది. ఈ వ్రత విశిష్టత గురించి కృష్ణుడు ద్రౌపదికి స్వయంగా వివరించాడని పురాణాలు చెబుతున్నాయి.

నేటి నుంచి ప్రతి ఇల్లు ఆలయం..

పవిత్రమైన శ్రావణమాసం నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈ మాసంలో ప్రతి ఇల్లు ఆలయాన్ని తలపిస్తుంది. సనాతన ధర్మంలో చంద్రమాసం ప్రకారం మనకున్న 12 మాసాల్లో ఐదవది శ్రావణ మాసం. సోమవారాలు పగలంతా ఉపవాసం ఉండి రాత్రి వేళల్లో పరమేశ్వరునికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేస్తే పాపాలు కడతేరుతాయని శాస్త్రం చెబుతోంది.

శుక్లపక్ష పౌర్ణమి..

శ్రావణ పౌర్ణమి రాఖీ పౌర్ణమిగా జరుపుకొనే ఈ రోజు సోదర సోదరీ బంధానికి సూచికగా జరుపుకొంటాం. కృష్ణ పాడ్యమి హయగ్రీవ జయంతి, కృష్ణపక్షవిధియ రాఘవేంద్ర స్వామి ఆరాధన వంటి ముఖ్యమైన రోజులు వచ్చేవి ఈ శ్రావణమాసంలోనే. శ్రీ కృష్ణాష్టమి, పొలాల అమావాస్య గోవులను పూజించడం వంటివి ఈ నెలలోనే వస్తాయి.

మహాలక్ష్మికి భక్తిశ్రద్ధలతో..

శ్రావణమాసంలో వచ్చే ప్రతి శుక్రవారానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తారు మహిళలు. ఈ మాసంలో లక్ష్మీదేవిని పూజిస్తే అష్టైశ్వర్యాలు కలుగుతాయని అంటారు. ముఖ్యంగా ఈ నెలలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీదేవి వ్రతాన్ని చేసుకుంటారు. పరమేశ్వరుడు పార్వతీదేవికి ఈ వ్రత మహాత్యాన్ని వివరించాడని పురాణగాథలు చెబుతున్నాయి. ఈ వ్రతాన్ని ఆచరించేందుకు ప్రత్యేక నియమాలంటూ ఉండవు. నిశ్చలమైన భక్తితో దేవిని పూజించి, కథ చదివితే చాలనీ, ఎవరైనా ఈ వ్రతాన్ని చేయొచ్చు. శనివారం రోజున ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని కోరుకుంటూ ఆంజనేయస్వామిని, వెంకటేశ్వర స్వామిని కొలుస్తారు. రెండు రోజులపాటు అమ్మవారు, శివ కేశవ ఆలయాల్లో విశేష పూజలు కొనసాగుతాయి.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో దేవాలయాల్లో శ్రావణ మాస పూజలకు ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. ప్రముఖ క్షేత్రాలైన నీలకంఠేశ్వరాలయం, శంభు లింగేశ్వర ఆలయం, మార్కండేయ మందిరం, మాధవనగర్ సాయిబాబా ఆలయం, సారంగాపూర్ ఆంజనేయస్వామి ఆలయం, జెండా బాలాజీ ఆలయం, హమల్‌వాడి సాయి సంతోషి ఆలయం, గోల్ హనుమాన్ ఆలయం, రామారెడ్డి కాలభైరవ ఆలయం, లక్ష్మీనృసింహ స్వామి ఆలయాలు శ్రావణమాస ప్రత్యేక పూజలు జరపనున్నాయి.

పరమేశ్వరుడికి ప్రీతికరమైన మాసం



పరమేశ్వరుడికి అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణ మాసం. ఈ మాసంలో పరమేశ్వరుడికి అభిషేకం చేస్తే మంచి ఫలితం ఉంటుంది.శివుడిని మనస్ఫూర్తి గామన మనసులో స్మరించుకొని శ్లోకాలు, పూజలు చేస్తే అనుకున్నది సాధ్యమవుతుంది.

– కాశీరాం, అర్చకులు, మార్కండేయ మందిరం

శుభ ముహూర్తాలు ఇవే..



మూడు నెలలుగా నిలిచిపోయిన శుభకార్యాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయి. ఈనెల 5, 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28, 30 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. వివాహాలు, శంకుస్థాపనలు, గృహ ప్రవేశాలకు ఇవే మంచి రోజులు. శ్రావణ మాసం సెప్టెంబర్‌3తో ముగుస్తుంది.

– ఘనాపాటి మధుసూదనశర్మ, అర్చకులు

సంపద వనాలపై పట్టింపేదీ?

- పెరిగిన పిచ్చిమొక్కలు
- పట్టించుకోని అధికారులు


పోచంపాడ్‌లో ఏర్పాటు చేసిన సంపద వనం


పోచంపాడ్ సంపద వనంలో పెరిగిన పిచ్చి గడ్డి

బాల్కొండ: పంచాయతీలు సంపద సృష్టించుకోవడం కోసం ఏర్పాటు చేసిన సంపద వనాలను పట్టించుకునే వారు కరువయ్యారు. సంపద మాట దేవుడెరుగు కనీసం వనంలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడం లేదు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలానికో సంపద వనాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కో వనం ఏర్పాటుకు రూ.ఐదు లక్షలు కేటాయించారు. దానిలో పండ్లనిచ్చే మొక్కలను పెంచి దాని ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని నిర్ణయించారు. సుమారుగా 2 నుంచి 3 ఎకరాల్లో వనాలను ఏర్పాటు చేశారు. కానీ ఎక్కడ కూడా సంపద వనాలు ముందుకు సాగడం లేదు.

ఇష్టారాజ్యంగా ఏర్పాటు

బాల్కొండ మండలం బస్సాపూర్ శివారులో పోచంపాడ్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో సంపద వనం ఏర్పాటు చేశారు. మెండోరా మండలంలో పోచంపాడ్ శివారులో కాకతీయ కాలువ భూమిలో ఏర్పాటు చేశారు. ముప్కాల్ మండల కేంద్రంలో వరద కాలువ భూమిలో ఏర్పాటు చేశారు. ఇష్టానుసారంగా మొక్కలు నాటడంతో అవి పెరగడం లేదు. వీటి నిర్వాహణ ఉపాధి హామీ కూలీల ద్వారా చేపడుతున్నారు. కానీ జీపీకి పూర్తి స్థాయిలో బాధ్యతలు అప్పగించలేదు. దీంతో పంచాయతీ అధికారులు సంపద వనాలను పట్టించుకోవడం లేదు. ఉన్నత అధికారులు స్పందించి వనాల్లో పిచ్చి మొక్కలను తొలిగించేల చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్రైం కార్నర్

స్వగ్రామానికి చేరిన మృతదేహం



మాక్లూర్: మండలంలోని రాంచంద్రాపల్లికి చెందిన శిరసు వెంకట్(52) బతుకుదెరువు నిమిత్తం మలేషియాకు వెళ్లగా అక్కడ గుండెపోటుకు గురై మృతి చెందగా మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. పేద కుటుంబం కావడంతో స్థానిక యువకులు విరాళాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని మలేషియా నుంచి రప్పించేందుకు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఎంతో కృషి చేశారని యువకులు తెలిపారు. అంత్యక్రియల్లో బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు కొత్తూర్ గిరీష్, రాష్ట్ర ఎస్టీ మోర్చా కార్యదర్శి తొడు మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పీఎస్ పరిధిలోని మాధవ్‌నగర్ బైపాస్ రోడ్డు సమీపంలో ఓ ఇంటి వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ పురుషోత్తం సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. డిచ్పల్లి ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 6,990 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్, లక్ష్మన్న, కానిస్టేబుల్ రాములు, సుధాకర్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- ఏడు తులాల బంగారం అపహరణ
- ముప్కాల్ మండలం రెంజర్లలో ఘటన

బాల్కొండ: ముప్కాల్ మండలంలోని రెంజర్లలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి ఏడు తులలాల బంగారాన్ని దొంగిలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకాం.. గ్రామానికి చెందిన ఏర్గట్ల రాజశేఖర్ హైదరాబాద్‌లో ఉంటుండగా ఆ ఇంట్లో అతని తల్లితండ్రులు ఉంటున్నారు. రెండు రోజుల క్రితం వారు ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లారు. ఇంటికి తాళం ఉన్న విషయాన్ని గ్రహించిన దుండగులు రాత్రి ఇంట్లోకి చొరబడి బెడ్ రూంలో ఉన్న బీరువా నుంచి రెండు బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన తల్లితండ్రులు ఇంట్లోకి వెళ్లి చూడగా బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీంతో వేలి ముద్రాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

15రోజుల్లో మూడు ఘటనలు

గత పదిహేను రోజుల్లో మూడు ఘటనలు తాళం వేసిన ఇంట్లోనే జరిగాయి. బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో గత నెల 19న, ముప్కాల్ మండల కేంద్రంలో గతనెల 22న దొంగతనాలు జరిగాయి. వాటిలో చోరీకి పాల్పడింది మహారాష్ట్రకు చెందిన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. అతడిని పట్టుకునేందుకు స్థానిక పోలీసులు మహారాష్ట్రకు వెళ్లినట్లు తెలిసింది. అంతలోనే రెంజర్లలో మరో చోరీ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వైఫల్యం వల్లే దొంగతనలు వరుస దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెట్రోలింగ్ పెంచాలని కోరుతున్నారు.

పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు


తాడ్కోల్ శివారులో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

బాన్సువాడ రూరల్: మండలంలోని వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ సరఫరాకు ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్లను కొందరు దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగిలిస్తున్నారు. ఈనెల 1న తాడ్కోల్ శివారులో ఏనుగంటి నాగేశ్వరరావు తన పొలంలోని ట్రాన్స్ ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి కాపర్‌వైర్లను దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఈనెల 3న తన పంటపొలంలోని ట్రాన్స్ ఫార్మర్ నుంచి దుండగులు కాపర్ వైర్లు దొంగిలించారని బోర్లంకు చెందిన మంద నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరుసగా జరుగుతున్న ఘటనలతో దుండుగులు తమపై ఏ అఘాయిత్యాలకు పాల్పడుతారోనని రైతులు జంకుతున్నారు. పోలీసులు దొంగల ముఠాను పట్టుకుని రైతుల్లో ధైర్యం నింపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తానాకలాన్‌లో..

ఎడపల్లి: మండలంలోని తానాకాలన్ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగిలించారు. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఉదయం తన పొలానికి వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

రెచ్చిపోతున్న కేటుగాళ్లు

- పోలీసుల పేరుతో కొనసాగుతున్న ఫేక్ కాల్స్
- పాకిస్తాన్ కోడ్‌తో వాట్సాప్ కాల్స్
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు


కిషన్‌గౌడ్‌కు వచ్చిన ఫేక్ కాల్ (ఫైల్)

మోర్తాడ్: కష్టపడకుండా భారీ మొత్తంలో డబ్బులు రావాలి.. అంటే మోసాలకు పాల్పడాలి అని అనుకుంటూ కొందరు కేటుగాళ్లు సైబర్‌నేరాలకు పాల్పడుతున్నారు. అయితే ఇప్పటి వరకు వాట్సాప్ ఖాతాదారుల డేటాను సేకరించి, డేటా సంబంధిత ఖాతాదారులను బెదిరించి నగదు వసూలు చేయడం, అలానే ఏదో ఒక లింక్‌ను వినియోగదారులకు పంపించి వారు ఆ లింక్ క్లిక్ చేసేలా ప్రలోభాలకు గురిచేసి, వాళ్లు ఆ లింక్‌ను క్లిక్ చేయగానే వాళ్ల బ్యాంక్ అకౌంట్‌లోని డబ్బులును కాజేయడం చూసాము.

అయితే ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు రూటు మార్చారు. మోసం చేయడంలో ఆరితేరిన కేటుగాళ్లు మీ అబ్బాయి డ్రగ్‌కేసులో దొరికాడని, మీ అమ్మాయిని కిడ్నాప్ చేశామని, మా స్నేహితుడి చెల్లెకు మీ కుమారుడు అసభ్యకరంగా మెసేజ్ చేశాడని ఇలా మీ మీద కేసు లేకుండా చేయాలన్నా, మీ పిల్లలు మీకు దక్కాలన్నా మేము అడిగిన డబ్బు ఇవ్వాల్సిందేనంటు బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీనిని కొందరు సైబర్ నేరమని ముందుగానే గుర్తించి వాటి నుంచి తప్పించుకుంటున్నారు.

తాజాగా.. కమ్మర్‌పల్లి మండలంలోని ఓ వ్యాపారికి ఫోన్ చేసిన సైబర్ నేరస్తుడు నీ కుమార్తె డ్రగ్స్ కేసులో ఇరుక్కుందని కేసు నమోదు చేస్తే ఆమె భవిష్యత్తు చెడిపోతుందని వాట్సాప్ కాల్‌లో వెల్లడించాడు. ఇది ఫేక్ అని గుర్తించిన సదరు వ్యాపారి సరే మాకు ఏది జరగాలో అది జరుగుతుందని మీరు సానుభూతి చూపించాల్సిన అవసరం లేదని మాట్లాడి పెట్టేశాడు. ఇలా దినమంతా వాట్సాప్ కాల్స్ వస్తూనే ఉండటంతో అతను వెంటనే సైబర్ నేరస్తుని నంబర్‌ను బ్లాక్ చేశాడు. అయినా మరో నంబర్‌తో కాల్ చేస్తూనే ఉన్నాడు. వ్యాపారితో మాట్లాడిన సమయంలో అతని కుమార్తె పేరు, ఇతర వివరాలు పక్కాగా చెప్పాడు. అయినా ఆ వ్యాపారి ఆందోళన చెందకుండా ఉండటంతో ఎలాంటి మోసానికి గురికాలేదు. అలాగే కమ్మర్‌పల్లికి చెందిన దూలూరు కిషన్ గౌడ్‌కు పోలీసు అధికారి ఫొటో డీపీతో ఉన్న ఓ పాకిస్తాన్ నంబర్‌తో కాల్ వచ్చింది. వాట్సాప్ కాల్ కావడం ఇప్పటికే ఈ ఫేక్ కాల్స్ గురించి అవగాహన ఉండటంతో కిషన్ గౌడ్ ఫోన్ ఎత్తలేదు. అలాగే రామన్నపేట్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు జాగీరపు మోహన్‌రెడ్డికి రెండు రోజులుగా ఒకే నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వస్తూనే ఉంది. వాట్సాప్ కాల్ చేసింది సైబర్ కేటుగాడు అని గుర్తించిన మోహన్‌రెడ్డి అగంతకునికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా హిందీలో ఇష్టం వచ్చినట్లు తిట్టడంతో కొన్ని క్షణాల్లోనే ఫోన్ పెట్టేశాడు. ఇలా ప్రతిసారి ప్రతి గ్రామంలో ఇద్దరు, ముగ్గురికి ఫేక్ కాల్స్ వస్తూనే ఉన్నాయి. ఎక్కువ మందికి +923260 కోడ్‌తోనే ఫేక్ కాల్స్ వస్తున్నాయని తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా కాల్స్ చేస్తున్న అగంతుకులు మాత్రం తాము ఎవరికి కాల్ చేస్తే వారి కుటుంబ సభ్యుల పేర్లు మాత్రం పక్కాగా చెబుతున్నారు. దీంతో అనేక మంది ఆందోళనకు గురవుతున్నారు. సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

రాళ్లవాగు వద్ద పర్యాటకుల సందడి


రాళ్లవాగు జలాశయం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ రాళ్లవాగు ప్రాజెక్ట్ ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద రావడంతో ప్రాజెక్ట్ జలాశయం నిండింది. దీంతో ప్రాజెక్ట్ మత్తడి పై నుంచి వరద దూకుతోంది. ఈ దృశ్యాన్ని వీక్షించడానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా జగిత్యాల, కరీంనగర్ జిల్లాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మత్తడి పైనుంచి నీరు దూకుతుండడంతో పర్యాటకులు స్నానాలు చేస్తూ సందడి చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం


రెంజర్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు


సమ్మేళనంలో పాల్గొన్న దోమకొండ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

దోమకొండ/ కామారెడ్డి క్రైం/ బాల్కొండ/ బాన్సువాడ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. దోమకొండలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1992–93, కామారెడ్డిలోని నియో ప్రగతి హైస్కూల్‌కు చెందిన 1998–99, ముప్కాల్ మండలం రెంజర్ల ఉన్నత పాఠశాలకు చెందిన 2008–09, బాన్సువాడలోని వివేకానంద విద్యాలయంలో 1999–2000కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించారు.



సమ్మేళనంలో పాల్గొన్న నియోప్రగతి పూర్వ విద్యార్థులు, వివేకానంద విద్యాలయ పూర్వ విద్యార్థులు

కబడ్డీ సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యంలో..


సమ్మేళనంలో పాల్గొన్న క్రీడాకారులు

వేల్పూర్: మండల కేంద్రంలో వేల్పూర్ కబడ్డీ జట్టు ఆధ్వర్యంలో కబడ్డీ సీనియర్ క్రీడాకారులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వేల్పూర్‌తో పాటు నిజామాబాద్, ముప్కాల్, కొత్తపల్లి, ఫత్తేపూర్, సుర్బిర్యాల్, నాగంపేట్, తాడ్వాయి గ్రామాల నుంచి జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆడిన సుమారు 60 మంది కబడ్డీ క్రీడాకారులు వేల్పూర్‌లో కలుసుకున్నారు. నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం వేల్పూర్‌కు చెందిన రెడ్‌రోజ్ యూత్ క్రీడాకారుడు ఏలేటి కిషన్, ముప్కాల్‌కు చెందిన గంగాధర్, ప్రదీప్, అంకాపూర్‌కు చెందిన రాజేందర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్రీడాకారులు నర్సారెడ్డి, సాయిరెడ్డి, మధు, శ్రీనివాస్, ప్రతాప్, హరికిషన్, మహేందర్, టైగర్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిజాంసాగర్ ప్రాజెక్టులో చేపలు వేటాడుతున్న పర్యాటకులు

'సాగర్'లో చేపల వేట



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించడానికి ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. గుల్‌దస్తా ప్రాంతంలోని 12 గేట్ల వద్ద ప్రాజెక్టులో పలువురు యువకులు గాలాలతో చేపలు పట్టారు.